# అల్లరి
ALLARI



పద్యం - భావం



**ఎరుగ వాని దెలుప నెవ్వడైనను జాలు**
**నొరుల వశముగాదు ఓగుదెల్ప**
**యేటివంక దీర్ప నెవ్వరి తరమయా?**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**తాత్పర్యం :** జిజ్ఞాస ఉన్నవారికి తెలియ జెప్పడం సులభమే. తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అని వాదించడం మూర్ఖుని సహజ లక్షణం. అలాంటి వారికి తెలియజెప్పడం ఎవరి తరమూ కాదు. ఏటికుండే ప్రకృతి సిద్ధమైన వంపును సరిచేయడం ఎంతటివారికైనా సాధ్యం కాదు. అలాగే మూర్ఖుణ్ని కూడా సరిచేయలేం.

## రంగులేయండి



చుక్కల ఆధారంగా బొమ్మ గీసి, రంగులు వేయండి.

# అల్లుడు

**ఉర్దూ కథ**

**పిల్లగాండ్లూ!** ఇదీ అకుబర్, బీరుబల్ కతే! తెలుసుగద.. తెలివిగుంటది, గమ్మతుగుంటది!

ఎప్పటిలెక్కనే అకుబర్.. బీరుబల్‌ను తోల్కొని ఆల్ల నగురం పక్క పొంటున్న జంగల్లకు ఏటకు పోయిండు. పోతుంటే తొవ్వపొంట శెట్లన్ని సక్కగ.. సింగారంగ గనిపిచ్చినయి. అన్ని శెట్లల్ల ఒక్క శెట్టు అంకర టింకరగ కనిపిచ్చింది. దాన్ని జూపిచ్చుకుంట.. ''అవు బీరుబల్! ఈ ఒక్క శెట్టే ఇట్లెందుకు అంకరగ ఉన్నది'' అంట అడిగిండు. దానికి బీరుబల్.. ''హుజూర్! అది అడివి శెట్లన్నిటికీ అల్లుడు శెట్టు. మీకు ఎర్కేగద.. 'కుక్కతోక.. అల్లుడు ఎప్పుడు అంకరే!' అంటరు పెద్దోళ్లు!'' అంట జెప్పిండు. దానికి అకుబర్.. ''అంటే మా అల్లుడు గూడ గసొంటోడేనా!'' అంట అనుమానపడ్డడు. ''అవు! అండ్ల అనుమానం ఏమున్నది! ఆయినె గూడ అల్లుడేనాయె!'' అంట జెప్పిండు బీరుబల్. ''అయితే మా అల్లుణ్ని జైల్లెయ్యుండ్రి.. అచ్చే నెల శిలువేద్దం!'' అంట హుకుం జారీ జేశిండు అకుబర్. నెల రోజులైనంక బీరుబల్ మూడు శిలువలు జేయించుకుని.. దర్బార్లకు దీసుకచ్చిండు. ''అగో! అల్లుడు ఒక్కడే అయితే.. మూడు శిలువలు ఎందుకు?'' అంట అడిగిండు అకుబర్. ''హుజూర్! ఈ ఇనుపది నాకు, ఎండిది మీకు, బంగారిది మీ అల్లునికి.. మనం ముగ్గురం గూడ అల్లుండ్లమే గద!'' అంట అని సలాం జేశిండు. అకుబర్ నవ్వి.. ''మా అల్లుణ్ని ఇడిశి పెట్టుండ్రి!'' అంట హుకుం జారీ జేశిండుల్ల.

... పత్తిపాక మోహన్



## తమాషా ప్రశ్నలు



- జాన కాని జాన?
  - ఖజాన
- రంగం కాని రంగం?
  - వీరంగం

## చెప్పుకోండి

- మేకల్ని తోలేసి తడకలకు పాలు పిండుతారు?
  - తేనెపట్టు
- రాళ్ల అడుగున విల్లు, విల్లు కొనలో ముల్లు?
  - తేలు

## మీకు తెలుసా?



పిల్లల్లో పాలపళ్లు ఊడిపోయి, గట్టిపళ్లు రావడం తెలిసిందే! మనుషుల్లోనే కాదు, పాలిచ్చే అన్ని జీవుల్లోనూ ఈ ప్రక్రియ వాటి జీవితకాలంలో ఒక్కసారే జరుగుతుంది. కానీ ఏనుగులు, కంగారూల్లో మాత్రం.. జీవితకాలంలో ఆరుసార్లయినా, పళ్లు ఊడిపోయి, మళ్లీ కొత్తపళ్లు వస్తాయట.